ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
మంగళవారం | సెప్టెంబరు 08, 2026 | సంపుటి : 7 | సంచిక : 84 | పేజీలు : 2




## జీవో 97కు వ్యతిరేకంగా నిరసన

- నల్ల బ్యాడ్జీలతో పాలిటెక్నిక్, ఫ్యాకల్టీ నిరసన

# నిరసనలు.. ఉద్రిక్తతలు..
## అసెంబ్లీలో మొదటి రోజు రచ్చరచ్చ

- నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- అడ్డుకున్న పోలీసులు
- బీజేపీ వాకౌట్
- తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపాటు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు నిరసనలు ఉద్రిక్తతల మధ్య వాడీ వేడీగా సాగింది. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రాగా.. పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు టీషర్ట్ విప్పి.. బనియన్ లతో గేటు బయట బైఠాయించి నిరసన తెలిపారు. '22ఏ' భూముల అక్రమాలపై చర్చకు బీజేపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో, ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలతో స్పీకర్ కంట తడి పెట్టుకోగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాల సమావేశాల తొలి రోజు శాసనసభలో భావోద్వేగ వాతావరణం నెలకొంది.





## తాత మధు వాఖ్యలు
# ముమ్మాటికి కుట్రనే

- దొరతనం, దొర అహంకారాన్ని దించాలి
- స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- స్పీకర్ ను అవమానించిన సభ్యుడిపై చర్యలు తీసుకోవాలి
- తాత మధు తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది
- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

**హైదరాబాద్, ఆయుధం:** స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలు ముమ్మాటికీ కుట్రపూరితమేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దుయ్యబట్టారు. సోమవారం అసెంబ్లీలో స్పీకర్‌పై తాత మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దొరతనం, దొర అహంకారాన్ని దించాలని.. స్పీకర్ ను అవమానించిన సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాత మధు తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ''తాత మధు వ్యాఖ్యల పట్ల కేసు నమోదు చేసి కేసీఆర్ ను ఏ1 గా చేర్చాలి. కేటీఆర్, హరీష్ రావును ఏ2, ఏ3 గా చేర్చాలి. బిఎన్ఎస్ యాక్ట్ 16/2 కింద కేసు నమోదు చేయాలి. ఎస్సీ, ఎస్టీ అక్ట్ తో పాటు 196,197 యాక్టు కూడా పెట్టాలి. బిఆర్ఎస్ నాయకులు పోలీసులపై ప్రవర్తించిన తీరుపై చర్యలు తీసుకోవాలి. శాసన సభలో స్పీకర్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు సభాపతి పై అనుచిత వ్యాఖ్యలపై వారి ప్రవర్తన పై సభలో చర్చ జరుగుతుంటే బీజేపీ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారు. బిజెపిలో ఒక దళిత ఎమ్మెల్యేలు ఎవరు లేకపోతే దళితులకు ఏమి అయినా మాకు సంబధం లేదు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. 14 సార్లు గెలిచిన ఏఐసీసీ అధ్యక్షుడు రాజ్యసభ (మిగతా 2 లో..)




# పద్మశాలీ ప్రతిభకు పట్టం
## నేతన్న టీవీ 'బిగ్గెస్ట్' సంబరం

- చేనేతకు గౌరవం.. సమాజ సేవకు గుర్తింపు
- ఓరుగల్లు గడ్డపై ఘనంగా నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్ –2026
- తొలి వార్షికోత్సవం సందర్భంగా అంగరంగ వైభవంగా అవార్డుల వేడుక..
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రముఖులు

హనుమకొండ, ఆయుధం: ఓరుగల్లు గడ్డపై పద్మశాలి సమాజం, చేనేత రంగ ప్రతిభకు ఘనమైన గౌరవం దక్కింది. నేతన్న టీవీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్ –2026' వేడుక హనుమకొండ బీమారంలోని ఎస్‌వీఎస్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. స్వరాజ్ టీవీ సౌజన్యంతో నేతన్న టీవీ సీఈవో పులికంటి రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ నలుమూలల నుంచి పద్మశాలి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, కళాకారులు, చేనేత కార్మికులు, పాత్రికేయులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ 6 గ్యారెంటీలు.. 420 హామీలు
# ఏమయ్యాయి?
### 1000 రోజుల పాలనలో హామీల అమలు ఎక్కడ?

- హామీలు బాకీలుగా మార్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం..
- ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డుతో బీఆర్ఎస్ ఉద్యమం..
- హామీలు ఇచ్చి మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి..
- మహిళలు, రైతులు, విద్యార్థులు... అందరికీ నెరవేరని హామీలు..
- ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది..
- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



**పర్వతగిరి, ఆయుధం**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలన నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు నిరసన చేపట్టారు. వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండల ప్రజా పరిషత్ ప్రజా వాణి సమావేశంలో ఎంపీడీవో కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు 6 గ్యారెంటీలు, 420 హామీలు, హామీ పత్రాలు, అఫిడవిట్ ల ద్వారా ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ''అధికారం లోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిలో చాలా వరకు అమలు కాలేదు. గతంలో ఎకరానికి రూ.10 వేలుగా ఉన్న రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో స్పష్టంగా ప్రకటించారని తెలిపారు. రైతుబంధు కింద రూ.15 వేలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం చేస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, చెప్పిన స్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. రైతు బీమా కింద రూ.5 లక్షల రక్షణ కల్పిస్తామని, రైతు కుటుంబా లకు అండగా ఉంటామని చెప్పి రైతు బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. (మిగతా 2 లో..)






## మట్టి వినాయక విగ్రహాలనే
# పూజించాలి

- - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హనుమకొండ, ఆయుధం;**

ప్రజలందరు మట్టి, సహజ రంగులతో చేసిన వినాయక విగ్రహాల ను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, హనుమకొండ జిల్లా మట్టి వినాయక విగ్రహాలు పంపిణి కార్యక్రమం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ హనుమకొండ, అదనపు కలెక్టర్, హనుమకొండ వారు గోడ పత్రికలను, మట్టి వినాయక విగ్రహాల ను ఆవిష్కరించి మట్టి వినాయక విగ్రహాల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ అఫ్ పారిస్ మరియు రసాయన రంగుల తో చేసిన వినాయక విగ్రహాల ను చెరువులలో, నదులలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితం అయి, నీటి కాలుష్యం తద్వారా పర్యావరణ కాలుష్యం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ టీజీపీసీబీ నోడల్ అధికారి బి. జీమూత వాహన, ప్లాస్టర్ అఫ్ పారిస్, రసాయన రంగుల తో తయారు చేసిన వినాయక విగ్రహాలు వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించి, పర్యావరణ అనుకూల మట్టి విగ్రహాల ను ఉపయోగించమని సూచించారు. పర్యావరణ అనుకూల/జీవవిచ్ఛిన్నమయ్యే ఉత్పత్తుల ను మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్లకు ప్రత్యామ్నాయాలను మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. జిల్లా అధికారులకు, స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాల ను పంపిణీ చేశారు.

## విద్య వ్యవస్థను రేవంత్..
# దెబ్బ తీస్తున్నాడు

- మొన్న ఇంటర్మీడియట్ రద్దు అన్నడు..
- నేడు పాలిటెక్నిక్ విద్యను ప్రమాదంలోకి నెట్టాడు
- ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఫీజు పోరు యాత్రతో దద్దరిల్లిన ఓరుగల్లు
- అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ
- కలెక్టర్ కు మెమోరాండం సమర్పించి విద్యార్థుల ఇబ్బందులు వివరించిన టీఆర్ఎస్ చీఫ్

**హన్మకొండ, ఆయుధం:** సీఎం రేవంత్ రెడ్డి విద్య వ్యవస్థను దెబ్బతీస్తున్నాడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన చేపట్టారు. హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన కవిత అక్కడి నుంచి 3 కి.మీ.ల దూరంలోని హన్మకొండ కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కవిత ఫీజు పోరుయాత్ర ఓరుగల్లు నగరం దద్దరిల్లింది. భారీ ర్యాలీగా కలెక్టరేట్ కు చేరుకున్న కవిత సహా విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. విద్యార్థులతో కలిసి కవిత కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద నడి ఎండలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంటకు పైగా ఆందోళన చేసిన అనంతరం అధికారులు కవిత సహా విద్యార్థులను కలెక్టరేట్ లోపలికి అనుమతించారు.
అంబేద్కర్ సర్కిల్ లో, కలెక్టరేట్ ఎదుట విద్యార్థులను ఉద్దేశించి కవిత మాట్లాడారు. ప్రభుత్వం రూ.13 వేల కోట్లకు పైగా ఫీ రీయింబర్స్మెంట్ చెల్లించాల్సి ఉందని.. టైం బాండ్ నిర్దేశించుకొని ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి దెబ్బతీస్తున్నారని అన్నారు. మొన్న ఇంటర్మీడియట్ (మిగతా 2 లో..)



## 17న ఉద్యమకారుల ఓదార్పు యాత్ర

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర పోస్టర్ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఓడపల్లి శ్యాం కృష్ణ ఆధ్వర్యంలో పోచమ్మ జంక్షన్ లో తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి.చాంద్ పాషా, బోలిశెట్టి అశోక్, ఎర్రంమనోహర్ రావు, చెన్నూరి నటరాజ్, రాంపల్లి శ్రీనివాసచారి, మొలంగూరు నెల్సన్, ఇమ్మడిశెట్టి రాజు, మేకల కృష్ణ, తొలి దశ ఉద్యమకారులు దాసరి జనార్ధన్, కొండేటి నారాయణరెడ్డి, ఉద్యమకారులు లింగంపల్లి నూతన ప్రసాద్, గుంపుల మాలతి లత, దేవుని రాజు, బంక కుమారస్వామి, ఆకుల వెంకటేశ్వర్లు, ఎండి. ఖాదర్, ఇప్ప రాములు, గద్దల జనార్ధన్, గద్దల కుమారస్వామి, ఆవుల నవీన్ కుమార్ తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.




## రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు

- జిల్లా యోగ అధ్యక్షుడు బొలిశెట్టి కమలాకర్

**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో యోగాసనా పోటీలు ఈనెల 9న బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓ సిటీ స్టేడియం లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ యోగ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కే.చంద్రశేఖర్ ఆర్య, జిల్లా అధ్యక్షులు బోలిశెట్టి కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన యోగా క్రీడాకారులు సెప్టెంబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు 8 సంవత్సరాల నుండి 45 సంవత్సరల వయస్సు గల వారికి వివిధ యోగ ఆసనాలు పోటీలు నిర్వహించబడును. ఈ పోటీలు బాల బాలికలకు మరియు పురుషులకు, మహిళలకు నిర్వహించబడును. యోగా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తగు వయసు నిర్ధారణ గుర్తింపు కార్డును జిరాక్స్ కాపీ తీసుకురావాల్సిందిగా తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 9502002308 బొలిశెట్టి కమలాకర్ అధ్యక్షులు, 8555859650 పి రవీందర్ నెంబర్లను సంప్రదించాలన్నారు.



## కాంగ్రెస్ 6 గ్యారెంటీలు.. 420 హామీలు

# ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి..)
వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అంది స్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. పంటలకు పంట బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడి దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా పంట బీమాపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు గతంలో ఎకరానికి రూ.10 వేల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని గుర్తుచేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పి అమలు చేయ లేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి కింద రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, తులం బంగారం ఇవ్వలేదని విమర్శించారు, గత ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణ లక్ష్మి పథకాన్నే నిర్వీర్యం చేసే పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ రోగులకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గతంలో ఉన్న రూ.2 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పినా, కొత్త పెన్షన్ల మంజూరులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, స్కూటీలు ఏమైంది అన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తాం అని ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్న ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం సరికాదు. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వం... కేసులకు భయపడొద్దు... మనల్ని ఇబ్బంది పెట్టిన వారికి సమాధానం చెప్తాము... కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా'' అని అరూరి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, PACS చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ AMC వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, AMC మాజీ డైరెక్టర్ ఏకాంతం గౌడ్, యుగేందర్ రావు చీమల బిక్షపతి మాజీ ఎంపీటీసీ రాజు, మండల సర్పంచులు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి పద్మశాలి యూత్ అండ

- **దశదినకర్మ కార్యక్రమానికి రూ.19 వేల ఆర్థిక సాయం**



**కమలాపూర్, ఆయుధం;** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద పద్మశాలి బూర లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి కమలాపూర్ పట్టణ పద్మశాలి యూత్ అండగా నిలిచింది. వారి కుటుంబాన్ని ఆదుకుందామని తోచిన సహాయం సేకరించి ఇవాళ దశదినకర్మ ఖర్చులకు రూ.19 వేల ఆర్థిక సాయం చేసి అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి యూత్ కమిటీ అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు చేనుమల్ల శ్రీకాంత్, కార్యదర్శి చేరాల సాయి కృష్ణ, సభ్యులు బూర రాజు, చందనాల నాగరాజు, మామిడాల రాజేష్, తుమ్మ అనిల్ కుమార్, పలువురు హాజరు పాల్గొన్నారు.

## తాత మధు వాఖ్యలు ముమ్మాటికి కుట్రనే

(మొదటి పేజీ తరువాయి..)
ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేసిన సంస్కృతి బీజేపీ పార్టీది. సభాపతి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కనీసం స్పందించే పరిస్థితి లేదు. బిఆర్ఎస్ పార్టీ ఒక దళిత స్పీకర్ ను అధ్యక్ష అని పిలిచే పరిస్థితి లేక చైర్ ను అవమానపరిచే విధంగా ఇద్దరు సభ్యులు మాట్లాడిన రికార్డ్ వెరిఫై చేసి సభ నుండి శాశ్వతంగా బయటకు పంపించాలి. ఆ ఇద్దరి సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. బిజెపి కి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న స్పీకర్ కి అవమానం జరిగిన కూడా మాట్లాడకుండా డైవర్షన్ జరుగుతుంది. బయట బీజేపీ, బిఆర్ఎస్ ఒప్పందం మేరకే టాపిక్ డైవర్ట్ చేయమని వాళ్ళు ఆడిస్తూ ఉంటే ఇక్కడ బీజేపీ వాళ్లు ఆడుతున్నారు. నిజంగా బీజేపీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధ ఉంటే సభాపతి కి అవమానం పై చర్చ చేయండి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయండి. సభ్యులకు భంగం కలిగితే కాపాడాల్సిన స్పీకర్ మీద ఆ ఇద్దరు సభ్యులు ఇలా మాట్లాడడం బాధాకరం. బీజేపీ, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకొని చర్చలో పాల్గొనడం లేదు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు సభ్యుల పై చర్యలు తీసుకోవాలి శాశ్వతంగా సస్పెండ్ చేయాలి.'' అని కేఆర్.నాగరాజు డిమాండ్ చేశారు.




## జీవో 97కు వ్యతిరేకంగా నిరసన

**వరంగల్, ఆయుధం:** సాంకేతిక విద్యాశాఖను *'శక్తి' పథకం/డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కొనసాగుతున్న నిరసనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. సోమవారం 22వ రోజు నిరసన కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ, విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించారు. జీవో నంబర్ 97ను వ్యతిరేకిస్తూ, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ ప్రత్యేకతను కాపాడాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు, సుమారు 800 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు క్యాంపస్‌లో పెద్ద సంఖ్యలో గుమిగూడి వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. "విలీనం వద్దు.. అభివృద్ధి ముద్దు" విద్యార్థులు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. "సాంకేతిక విద్యాశాఖ విలీనం దుర్మార్గం.. విలీనం వద్దు.. అభివృద్ధి ముద్దు.. శక్తి స్కీమ్ బహిష్కరణ" అంటూ నినాదాలతో క్యాంపస్‌లో నిరసన హోరెత్తించారు. సాంకేతిక విద్యాశాఖను ఇతర విభాగాల్లో విలీనం చేయడం వల్ల పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ యొక్క ప్రత్యేకత, నాణ్యత, పరిపాలనా నిర్మాణంపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ నిర్ణయం తమ విద్యా భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. 22 రోజులుగా ఫ్యాకల్టీ, విద్యార్థులు వివిధ ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నిరసనలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సమస్యపై స్పష్టమైన స్పందన రాకపోవడంపై విద్యార్థులు, ఫ్యాకల్టీ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ కీలక అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, జీవో నంబర్ 97ను పునఃపరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యాశాఖ విలీన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత విద్యాశాఖ మంత్రి తక్షణమే స్పందించి*, విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు.

# పద్మశాలీ ప్రతిభకు పట్టం





## నేతన్న టీవీ 'బిగ్గెస్ట్' సంబరం

- **చేనేతకు గౌరవం.. సమాజ సేవకు గుర్తింపు**
- **ఓరుగల్లు గడ్డపై ఘనంగా నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్ –2026**
- **తొలి వార్షికోత్సవం సందర్భంగా అంగరంగ వైభవంగా అవార్డుల వేడుక..**
- **రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రముఖులు**

**హనుమకొండ, ఆయుధం:**

ఓరుగల్లు గడ్డపై పద్మశాలి సమాజం, చేనేత రంగ ప్రతిభకు ఘనమైన గౌరవం దక్కింది. నేతన్న టీవీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్-2026' వేడుక హనుమకొండ బీమారంలోని ఎస్‌వీఎస్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. స్వరాజ్ టీవీ సౌజన్యంతో నేతన్న టీవీ సీఈవో పులికంటి రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ నలుమూలల నుంచి పద్మశాలి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, కళాకారులు, చేనేత కార్మికులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



### చేనేతకు అండగా.. సమాజానికి బాసటగా

ఏడాది కాలంగా నేతన్న టీవీ పద్మశాలి సామాజిక వర్గం, చేనేత కార్మికుల సమస్యలను ప్రజా వేదికపైకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని వక్తలు ప్రశంసించారు. పద్మశాలీల ఐక్యత, సామాజిక చైతన్యం, రాజకీయ అవగాహనతో పాటు చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై నేతన్న టీవీ చేస్తున్న కృషిని వారు అభినందించారు. సమాజం కోసం పనిచేసిన వారిని గుర్తించి.. వారి సేవలకు సముచిత గౌరవం ఇవ్వాలనే లక్ష్యంతో ఈ అవార్డుల వేడుకను నిర్వహించడం విశేషం.

### నాలుగు ప్రతిష్ఠాత్మక అవార్డులు..

తమ తమ రంగాల్లో విశేష ప్రతిభ, సేవలు అందించిన పలువురిని ఎంపిక చేసి ప్రతిష్ఠాత్మక పురస్కారాలతో సత్కరించారు.
చేనేత రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి చేనేత ఆణిముత్యం, కళారంగంలో విశేష ప్రతిభ చూపిన వారికి పద్మశాలి కళారత్న, వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పద్మశాలి మణిరత్న, పద్మశాలి సమాజం ఐక్యత, అభ్యున్నతి కోసం కృషి చేసిన వారికి పద్మశాలి సేవా పురస్కార్ అందజేశారు.

### 'నభూతో.. నభవిష్యతి'

పద్మశాలి సమాజంలోని వివిధ రంగాల ప్రతిభావంతులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఇంత భారీ స్థాయిలో అవార్డులు అందించడం అభినందనీయమని ప్రముఖులు కొనియాడారు. ఈ స్థాయిలో జరిగిన అవార్డుల వేడుక 'నభూతో.. నభవిష్యతి' అన్న చందంగా నిలిచిందని పేర్కొన్నారు. కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, జాతీయ గుండు ప్రభాకర్, అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం, బీసీ సంఘం జాతీయ నాయకులు గుజ్జ సత్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొని నేతన్న టీవీ కృషిని అభినందించారు. నేతన్న టీవీ మరింత అభివృద్ధి చెంది పద్మశాలి సమాజంతో పాటు చేనేత కార్మికుల సమస్యలకు వేదికగా నిలవాలని ప్రముఖులు ఆకాంక్షించారు. సామాజిక ఐక్యత, చైతన్యం కోసం నేతన్న టీవీ చేస్తున్న కృషి మరింత విస్తరించాలని సూచించారు.

### ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు:
### పులికంటి రాజేందర్

నేతన్న టీవీ, స్వరాజ్ టీవీ సీఈవో పులికంటి రాజేందర్ మాట్లాడుతూ.. నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డుల కార్యక్రమానికి హాజరైన అతిరథ మహారథులు, పద్మశాలి రాష్ట్ర, జిల్లా నాయకులు, రాజకీయ ప్రముఖులు, పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

### 'ఈ గౌరవం మరింత బాధ్యత పెంచింది'

అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. తమ తమ రంగాల్లో చేసిన కృషిని గుర్తించి నేతన్న టీవీ తమను సత్కరించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ పురస్కారం తమకు మరింత ప్రోత్సాహాన్ని, సమాజం పట్ల మరింత బాధ్యతను కలిగించిందన్నారు.

### ప్రముఖుల సందడి..

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, వైద్యం రాజగోపాల్, రాష్ట్ర నాయకులు తౌటం రవీందర్-ఝాన్సీరాణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సాంబారి సమ్మారావు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే-ఐజేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు వల్లాల వెంకటరమణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం వివిధ విభాగాల నాయకులు, పలు జిల్లాల అధ్యక్షులు, సామాజిక ప్రముఖులు, కళాకారులు, చేనేత రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను విజయవంతం చేశారు.




















## విద్యావ్యవస్థను రేవంత్ దెబ్బతీస్తున్నడు

(మొదటి పేజీ తరువాయి..)
వ్యవస్థ రద్దు చేస్తానని అన్నారని.. ఇప్పుడు పాలిటెక్నిక్ విద్యను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాడని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా విద్యార్థుల జీవితాలు ఆగమావుతున్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో పేదలు, ఆడబిడ్డలు చదువుకు దురువుతున్నారని తెలిపారు. ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీలు పూర్తి చేసినా రీ యింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో కాలేజీల యాజమాన్యాలు వారికి సర్టిఫికెట్లు ఇవ్వక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని గతంలో తాను శాసనమండలి సభ్యురాలిగా సభలో లేవనెత్తానని గుర్తు చేశారు. తాను శాసన మండలిలో ప్రశ్నించినప్పుడు నెల నెలా ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పారని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలను ఆగం చేసే హక్కు ఈ ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి బకాయిలు పెట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా చిన్న చిన్న కాలేజ్ మూత పడుతున్నాయని అన్నారు. ఫీ రీయింబర్స్ మెంట్ పై ఆధారపడి చదువుకునే విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైందని అన్నారు. ప్రభుత్వం ఫీజు చెల్లించపోతుండటంతో చాలా మంది పేద విద్యార్థుల విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా ఆడపిల్లలే ఎక్కువ నష్టపోతున్నారని, ఫీజులు కట్టే స్తోమత లేక వారి తల్లితండ్రులు ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారని చెప్పారు. ఆడపిల్లలను విద్యకు దూరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో కలిసి హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను కవిత కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీ రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవటంతో జరుగుతున్న నష్టాన్ని కలెక్టర్ కు వివరించారు.

### గ్రేటర్ వరంగల్ టీఆర్ఎస్ జైత్రయాత్ర

గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో అన్ని డివిజన్ల నుంచి పోటీలో ఉంటామని కవిత చెప్పారు. ఇక్కడ నుంచే టీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభిస్తామన్నారు. హన్మకొండ జిల్లా తరాలపల్లిలో పార్టీ జెండాను కవిత ఆవిష్కరించారు. అంతకుముందు తరాలపల్లిలో పార్టీ శ్రేణులు కవితకు ఘన స్వాగతం పలికారు.

### వనవాసం పోయినట్టుగా అయోధ్యపురం రైతుల పరిస్థితి

అయోధ్యపురం రైతుల పరిస్థితి వనవాసం పోయినట్టుగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఆమె సందర్శించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కారణంగా భూములు కోల్పోతున్న బాధితులందరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ భూములు దేవాదాయ శాఖ భూములతో కలిసి ఉండడంతో పరిహారం విషయంలో అన్యాయం చేశారని ఈ సందర్భంగా నిర్వాసితులు కవితకు వివరించారు. కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేలోపు బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామని వారికి మాటిచ్చారు. ఈ అంశానికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖ మంత్రితో పాటు మన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు లేఖ రాస్తానని కవిత అన్నారు.

### మహిళా శాసనసభ్యులపై పోలీసుల తీరు దుర్మార్గం

తెలంగాణ అసెంబ్లీ వద్ద మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గమని కవిత అన్నారు. సీనియర్ మహిళా ఎమ్మెల్యేల గొంతు పట్టి నెట్టేయడం, చీరలు లాగడం, బూటు కాళ్లతో తొక్కి హింసించడం దారుణమని "ఎక్స్" వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా శాసన సభ్యులకే ఈ రాష్ట్రంలో భద్రత లేదంటే సామాన్య మహిళల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై హింస, దాడులు పెరుగుతున్నాయని... ప్రస్తుత డీజీపీ బాధ్యతలు చేపట్టాక పరిస్థితి మరింత దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడులకు కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

- **చిప్ప వెంకటేశ్వర్లు నేత**
- **కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ**

**వరంగల్, ఆయుధం:** కొత్తవాడలో చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సౌజన్యంతో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కార్యక్రమంలో మూడో బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ Rtn అధ్యక్షుడు సోమ వేణుగోపాల్, ప్రాజెక్ట్ చైర్మన్ Rtn పీపీ బేతి అశోక్ బాబు, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, నేత రాగవులు ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలకు కుట్టుశిక్షణ అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వారు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇది దోహదపడుతుందని వారు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు ఆడెపు శిరీష, మాస్టర్ ట్రైనర్ శ్రీ కరుణ మాట్లాడుతూ, ఇప్పటివరకు ఈ శిక్షణా కేంద్రం ద్వారా 100 మంది మహిళలు కుట్టుశిక్షణ పూర్తి చేసుకుని ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన చిప్ప వెంకటేశ్వర్లు మరియు కుట్టు మిషన్స్ ఇచ్చిన రోటరీ క్లబ్ సభ్యుల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం ద్వారా మహిళా సాధికారతకు తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు.




Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695